## మదన్‌లాల్ మృతికి 'వనమా' సంతాపం


మదన్‌లాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వనమా

పాల్వంచ, మే 29:వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మృతికి కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు. మదన్‌లాల్ స్వగ్రామమైన ఈర్లపూడికి గురువారం వెళ్లిన వనమా.. అక్కడి మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వనమా రాఘవేందర్‌రావు, అన్వర్‌పాషా, శేషాద్రి వినోద్, మజీద్, బొందుగుల శ్రీధర్, ఏనుగుల శ్రీను, కోయాడ శ్రీను, రాజేందర్, లచ్చిరాం, చిన్న శ్రీను, మైను, అక్బర్, గొడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బాలూనాయక్‌కు పరామర్శ


బాలూనాయక్‌ను పరామర్శిస్తున్న హరిప్రియానాయక్

ఇల్లెందు, మే 29: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్‌ఎస్ టేకులపల్లి మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలూనాయక్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ గురువారం ఖమ్మం ఆస్పత్రిలో పరామర్శించారు. దాస్‌తండా ఎంపీటీసీ సభ్యుడు భూక్య బాలకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు భూక్య లాల్‌నాయక్, బానోత్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సంతాపం తెలిపిన 'రేగా'

మణుగూరు టౌన్, మే 29: మండలంలోని బావి కూనవరం గ్రామస్తురాలు ఎనిక మల్లీశ్వరి అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. మృతదేహాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు.

## ఢిల్లీ జాతీయ సదస్సుకు ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 29:యూనిసెఫ్ సహకారంతో రెండు రోజులపాటు ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు కొత్తగూడెం జిల్లా నుంచి ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధువరుణ్ గురువారం హాజరయ్యారు. 'మానవ ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాలు – దేశంలో వాతావరణ అనుకూలత కోసం ఆవిష్కరణలు, పరస్పర అధ్యయనాలు' అనే అనే అంశాలపై జరుగుతున్న ఈ సదస్సులో ఆయన పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీకి రూట్‌మ్యాప్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 29:2025–26 విద్యా సంవత్సరానికి గాను కొత్తగూడెం మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జూన్ మొదటి వారంలోనే ప్రభుత్వ పుస్తకాలు చేరేలా కొత్తగూడెం ఎంఈవో ప్రభుదయాళ్ ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఆర్‌పీలతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పుస్తకాల పంపిణీకి సంబంధించి రూట్ మ్యాప్ తయారు చేశారు. అనంతరం, జూన్ 3 నుంచి నిర్వహించనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు.

## గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో 1 నుంచి అడ్మిషన్లు

పాల్వంచ, మే 29:పాల్వంచ నెహ్రూనగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం జూన్ ఒకటో తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 7989325024, 7382978520 నంబర్లను సంప్రదించాలని కోరారు.

IN THE COURT OF THE HON'BLE AGENT TO GOVERNMENT AT KOTHAGUDEM
DOP No. 16 of 2025
Between:
Ponnuru Naga Srinivasa Rao ....Petitioner
And
Ponnuru @ Ramisetti Bharghavi ....Respondent
NOTICE
To
Respondent : Ponnuru @ Ramisetti Bharghavi, D/o.Late Ramisetti Uma Maheshwar Rao, W/o. Ponnuru Naga Srinivasa Rao, Age: 33 Years, Occ: Business and Household, R/o. H.No.22-2-56/1, Srinivasa Nagar Colony, Palvoncha Mandal, Bhadradri Kothagudem District.
That the petitioner filed the above petition for Dissolution of Marriage under Section 13(1a)(1b) of Hindu Marriage Act, against his wife Smt.Ponnuru @ Ramisetti Bharghavi on the file of the Hon'ble Agent to Government, at Kothagudem vide HMOP No.16 of 2025. In Spite of notice sent to you, you are evading to receive the notice on one or other pretext. Take note that the above petition is posted on 27/06/2025. If you fail to appear before this Hon'ble Court either person or through the counsel on 27/06/2025 at 3.30 Pm the matter will be determined ex parte.
//By order of the court//
J.GAY KUMAR
Advocate for Petitioner

## దర్శించుకున్న మంత్రి సీతక్క

భద్రాచలం, మే 29: భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క కుటుంబసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆమెకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భ గుడిలో మంత్రి పూజలు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయంలోని ఉపాలయాల్లో శ్రీలక్ష్మీ తాయారమ్మను, అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
టెలికాలర్స్ కావలెను
★ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు మంచి వాక్ చాతుర్యం కలిగిన మహిళ టెలికాలర్ కావలెను. జీతం : 10,000/– నుండి 20,000/–వరకు ఇవ్వబడును. సంప్ర: 8297529999
KMM-
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మహారాజశ్రీ ఏజెన్సీ కోర్టు, జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
OS No. 101 of 2025
Between:
పోలెబోయిన కళావతి & ఇతరులు ...వాది
And
కట్టా శ్రీవాణి & ఇతరులు ..ప్రతివాదులు
NOTICE
To,
1 నుండి 7 వరకు ప్రతివాదులు
1. కట్టా శ్రీవాణి
2. కట్టా శ్రీనివాసరావు
3. శాఖమూడి సురేందర్
1 నుంచి 3 మంది వ్యక్తుల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం మల్లారం గ్రామంలో నివాసం ఉంటున్నారు.
4. రఘుపతి జయ
5. రఘుపతి వెంకటేశ్వర్లు
6. రఘుపతి హరీష్
7. పటేల్ నరసింహారావు
నంబర్ 4 నుంచి 7 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం శ్రీనగర్ వాసులు.
పైన పేర్కొన్న వాది OS No.101/2025 దావా ద్వారా కొత్తగూడెంలో గౌరవనీయ ప్రభుత్వ ఏజెన్సీ కోర్టులో దాఖలు చేసిన దావా పై ప్రతివాదులకు వ్యతిరేకంగా శాశ్వత నిషేధం కోసం వాది పైన పేర్కొన్న దావాను దాఖలు చేశారు. మీకు నోటీసు పంపినప్పటికీ, మీరు ఏదో ఒక కారణంతో నోటీసును అందుకోకుండా తప్పించుకుంటున్నారు. పై దావా 27/06/2025న పోస్ట్ చేయబడిందని గమనించండి. మీరు ఈ గౌరవనీయ న్యాయస్థానం ముందు 27/06/2025న మధ్యాహ్నం 3.30 గంటలకు వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కాకపోతే, ఈ దావా మీకు వ్యతిరేకంగా నిర్ణయించబడుతుంది.
// కోర్టు ఆదేశం ద్వారా //
J.GAY KUMAR
Advocate for Petitioner

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# తొలిబడి అమ్మ ఒడి.. మలిబడి అంగన్‌వాడీ..

- పిల్లలందరికీ నర్సరీ పాఠాలతోపాటు పౌష్టికాహారమూ అందిస్తాం
- అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షల ఉద్యోగ విరమణ ప్రయోజనాలు
- ఇందిరమ్మ అమృత పథకం ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క


ఐసీడీఎస్ స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/చుంచుపల్లి, మే 29: శిశువులకు తొలిబడి అమ్మ ఒడి అయితే.. మలిబడి అంగన్‌వాడీయే అవుతోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లలందరికీ నర్సరీ పాఠాలతోపాటు పౌష్టికాహారమూ అందిస్తామని అన్నారు. రక్తహీనతను అధిగమించి కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు ఐసీడీఎస్‌లో ఇందిరమ్మ అమృత పథకాన్ని అందుబాటులోకి తెచ్చామని వివరించారు. భద్రాద్రి జిల్లాలో గురువారం పర్యటించిన ఆమె.. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఆమె ఇందిరమ్మ అమృత పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'ఆడపిల్లలకు శక్తినిద్దాం.. ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం' అనే నినాదంతో ఇందిరమ్మ అమృత పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిందని అన్నారు. రాబోయే కాలంలో ఆశా వర్కర్ల జీతాల పెంచుతామని, వారిని రెగ్యులరైజేషన్ చేస్తామని అన్నారు. మిషన్ వాత్సల్య కింద తల్లిదండ్రులు లేని పిల్లలకు నెలకు రూ.4 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. కాగా, ఈ పథకం కింద జిల్లాకు మంజూరైన రూ.74.64 లక్షల విలువైన చెక్కులను పిల్లలకు మంత్రి అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆమోదానికి కృషిచేసిన మంత్రి సీతక్కను మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు సన్మానించారు.

**హైలెవల్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన**

అనంతరం చుంచుపల్లి మండలంలో పాత కొత్తగూడెం – పెనుబల్లి మధ్య మొర్రేడు వాగుపై రూ.6.50 కోట్లతో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా కూడా నిధులు మంజూరు చేయించి జిల్లాలోని ప్రతి గ్రామానికీ రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తోందని అన్నారు. మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, ఆ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐటీడీఏ పీవో రాహుల్, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సీపీవో సంజీవరావు, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిని కాపాడుకుందాం


మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

భద్రాచలం, మే 29: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కోసం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాతాను స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సీనియర్ నాయకుడు లక్ష్మినారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, వర్క్ బుక్స్ ఉచితంగా ఇస్తారని చెప్పారు. జూన్ 5వ తేదీ వరకు ఈ ప్రచార జాతా నిర్వహిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్, నాయకులు కృష్ణ, వెంకటేశ్వర్లు, తావూర్య, శైలజ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం, మే 29: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ నాయకులు గురువారం మండలంలో ప్రచార జాతా నిర్వహించారు. బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'ధ్యానంతో మానసికంగా జ్ఞానవంతులవుతారు'

పాల్వంచ, మే 29: ధ్యానంతో మానవులు మానసికంగా, శారీరకంగా జ్ఞానవంతులు అవుతారని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం జిల్లా నోడల్ కో ఆర్డినేటర్ సీతామహాలక్ష్మి అన్నారు. పాల్వంచ కేటీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి కొనసాగుతున్న ఉపాధ్యాయుల వృత్యంతరలో శిక్షణలో భాగంగా గురువారం హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో సీతామహాలక్ష్మి మాట్లాడారు. గుణాత్మకమైన విద్యను సాధించేందుకు మానసికంగా, శారీకంగా ఎలా సంసిద్ధత కావాలనే అంశాలను వివరించారు. కోర్సు ఇన్‌చార్జి, నర్సాపురం జడ్పీఎస్‌ఎస్ హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావు, ట్రైనర్లు వై.నిర్మల, మల్లారెడ్డి, పద్మ, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్టతో భూమికి బలం


జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న తాతారావు

బూర్గంపహాడ్, మే 29: ఎరువుల వాడకాన్ని తగ్గించి, పచ్చిరొట్ట వాడితే భూమికి బలం వస్తుందని మణుగూరు ఏడీఏ తాతారావు అన్నారు. బూర్గంపహాడ్ ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో రైతులకు జీలుగు, బీపీటీ 5204 విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. భూమిలో జీలుగు కలియదున్నిన తర్వాత పంట వేస్తే విశేష లాభాలు ఉంటాయన్నారు. సంఘం అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు, సీఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**సబ్సిడీపై జీలుగు విత్తనాలు సిద్ధం**

చర్ల, మే 29: మండలంలోని చర్ల, సత్యనారాయణపురం సహకార సంఘాల్లో సగం సబ్సిడీపై జీలుగు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చర్ల, సత్యనారాయణపురం సహకార సంఘాల అధ్యక్షులు పరుచూరి రవికుమార్, మందపాటి అచ్యుత శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు.

**పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ**

చండ్రుగొండ, మే 29: మండలంలోని గానుగపాడు సహకార సంఘం కార్యాలయంలో సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను చైర్మన్ చెవుల చందర్‌రావు గురువారం రైతులకు అందజేశారు. సొసైటీ కార్యదర్శి లంక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన అక్రమార్కులపై కఠిన చర్యలు


తనిఖీ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, మే 29: విత్తనాల దుకాణాదారులు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. ఆయన గురువారం టేకులపల్లిలో విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విత్తన విక్రయాలతో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. టేకులపల్లి సీఐ సురేష్, ఏవో అన్నపూర్ణ, ఎస్సై రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల, మే 29: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్ఐ, ఏవో వెంకటరమణ పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### ఇంకుడు గుంతల నిర్మాణం

అశ్వారావుపేట రూరల్, మే 29: మండలంలోని మల్లాయిగూడెం పంచాయతీలోని మల్లాయిగూడెం, పండువారిగూడెం, కొండతోగు, దిబ్బగూడెం గ్రామాల్లో గురువారం ఇంకుడు గుంతలను పంచాయతీ సిబ్బంది తవ్వారు. వీటి ప్రయోజనాలను ప్రజలకు కార్యదర్శి శ్రీకాంత్ వివరించారు.

### ముగిసిన సమ్మర్ క్యాంప్

బూర్గంపహాడ్, మే 29: జమాతే ఇస్లామిక్ హింద్(జేఐహెచ్) సారపాక పట్టణ శాఖ ఆధ్వర్యంలో మే 25 నుంచి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు సాజిదా మజీద్‌లో ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ జరిగింది. గురువారం ముగింపు కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జహీర్‌పాషా, సభ్యులు షేక్ నాగూర్‌వలీ, షేక్ అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

### సీహెచ్‌సీ భవనానికి నేడు భూమి పూజ

బూర్గంపహాడ్, మే 29: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం భూమి పూజ చేస్తారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

### సీఐకి శుభాకాంక్షలు

మణుగూరు టౌన్, మే 29: మణుగూరు సీఐగా ఇటీవల విధుల్లో చేరిన నాగబాబును టీబీజీకేఎస్ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బండారి పవన్‌కుమార్, వినయ్‌కుమార్, ముకేష్ కుమార్, మునిగల నాగేశ్వరరావు, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బృందం పర్యటన

పర్ణశాల, మే 29: మండలంలో గురువారం కేంద్ర బృందం పర్యటించింది. పర్ణశాల రామాలయాన్ని సందర్శించింది. ఈ బృందంలో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారులు రాకేష్‌కుమార్, అమిత్‌కుమార్ ఉన్నారు.

### రోడ్లపై ఆటోలు నిలపవద్దు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ నాగబాబు

మణుగూరు టౌన్, మే 29: ఆటో డ్రైవర్లు రోడ్లపై ఆటోలను అడ్డదిడ్డంగా నిలుపవద్దని మణుగూరు సీఐ నాగబాబు అన్నారు. సీఐగా ఇటీవల విధుల్లో చేరిన ఆయన పట్టణంలో గురువారం పర్యటించారు. ఆటో అడ్డాల వద్ద డ్రైవర్లతో మాట్లాడారు. ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

### మహిళలకు ఆటల పోటీలు


వాలీబాల్ ఆడుతున్న మహిళలు

ఇల్లెందు రూరల్, మే 29: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి ఉద్యోగుల కుటుంబాల్లోని మహిళలకు, సేవా సమితి సభ్యులకు గురువారం స్థానిక సీఆర్ క్లబ్‌లో ఆటల పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులను సేవా సమితి అధ్యక్షురాలు రమ ప్రదానం చేశారు. డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

### బొగ్గు టిప్పర్‌లో మంటలు


టిప్పర్‌లో చెలరేగిన మంటలు

అన్నపురెడ్డిపల్లి, మే 29: బొగ్గు టిప్పర్ నుంచి మంటలు వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఓ టిప్పర్, గురువారం బొగ్గు అన్ లోడ్ చేసి సత్తుపల్లి వైపు వెళ్తున్నది. మండలంలోని శాంతినగర్ సమీపంలోగల జాతీయ రహదారిపై రైల్వే వంతెన వద్ద దీని ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మంటలను ఫైర్ ఇంజిన్‌తో వచ్చిన సిబ్బంది ఆర్పివేశారు. ఎస్సై చంద్రశేఖర్ దర్యాప్తు చేపట్టారు.

### ఐటీసీలో ప్రమాదం.. కార్మికుడు మృతి

బూర్గంపహాడ్, మే 29: మండలంలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో గురువారం ప్రమాదం జరిగింది. కాంట్రాక్ట్ కార్మికుడు మృతిచెందాడు. మండలంలోని పెద్ద కమలాపురానికి చెందిన హరీష్(25), సారపాక గాంధీనగర్‌లో నివాసముంటూ ఐటీసీ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా గురువారం పీఎం–7 విభాగంలోని రూఫ్ షీట్.. వర్షానికి కారుతున్నది. లైఫ్‌లైన్ తాడు సాయంతో హరీష్ మరమ్మతులు చేస్తున్నాడు. నడుముకు ఉన్న బెల్ట్ ఊడిపోవడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన హరీష్‌ను తోటి కార్మికులు అంబులెన్స్‌లో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పద్మ ఇన్సులేషన్ కంపెనీ కాంట్రాక్టర్ వద్ద ఇతడు పనిచేస్తున్నాడు.

## 'బ్యాక్‌లాగ్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**

భద్రాచలం, మే 29 : తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ బాలికుల గురుకుల విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి 1, 2, 5 తరగతుల్లో మిగిలిన బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశం కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పినపాక మండలంలోని గురుకుల పాఠశాలలో 1, 2, 5వ తరగతుల్లో మిగిలిన బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశానికి అర్హత కలిగిన గిరిజన విద్యార్థినులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, స్థానికంగా విద్యార్థినులు లేనిపక్షంలో సమీప మండలాల వారికి రెండో ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. పినపాకలో ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని, విద్యార్థిని రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సంతకం, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్‌ను పొందుపర్చాలని కోరారు. 1వ తరగతిలో 30, 2లో 1, 5లో 8 ఖాళీలకు ఎంపిక ప్రక్రియ లాటరీ పద్ధతిన జరుగుతుందని, పూర్తి వివరాలకు 9701495907, 7702652708 నెంబర్లలో సంప్రదించాలని పీవో కోరారు.

## ఓఎస్డీగా నరేందర్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న నరేందర్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 29:కొత్తగూడెం ఓఎస్డీ, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా గోపతి నరేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం నగరానికి చెందిన నరేందర్.. 1996లో ఎస్సైగా ఎంపికై 'అప్పా'లో శిక్షణ పొందారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎస్సైగా తొలి పోస్టింగ్ పొందారు. 2006లో సీఐగా ఆయనకు ఉద్యోగోన్నతి లభించింది. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో ఎస్సైగా, సీఐగా, డీఎస్పీగా 28 ఏళ్లపాటు సేవలందించారు. 2017లో డీఎస్పీగా ప్రమోషన్ పొందిన నరేందర్.. మంచిర్యాల తొలి బాధ్యతలు స్వీకరించారు. 2022లో కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం కరీంనగర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన.. అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది కొత్తగూడెం ఓఎస్డీగా బదిలీపై వచ్చారు. గురువారం కొత్తగూడెం అదనపు ఎస్పీ (ఆపరేషన్స్)గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం.. ఎస్పీ రోహిత్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## 'కొత్తగూడెం ఏరియా'లో ఎస్టీ కమిటీ పర్యటన


మాట్లాడుతున్న లైజన్ ఆఫీసర్ల బృందం సభ్యులు

రామవరం, మే 29: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్టీ కమిటీ బృంద సభ్యులు కొత్తగూడెం ఏరియాలో గురువారం పర్యటించారు. కమిటీ చీఫ్ లైజన్ ఆఫీసర్ కృష్ణయ్య రోస్టర్ పాయింట్ వెరిఫికేషన్ కోసం జీఎం కార్యాలయానికి వచ్చారు. ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్ల రోస్టర్ రిజిస్టర్లను సెంట్రల్ ఎస్టీ కమిటీ చీఫ్ లైజన్ ఆఫీసర్ కృష్ణయ్య, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తిరుమలరావు, రోస్టర్ పాయింట్ వెరిఫికేషన్ సభ్యులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డీజీఎం శివకేశవరావు, నాగేశ్వరరావు, పంతులు, యోహాన్, తౌఐర్య, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం


రామయ్య సన్నిధిలో మంత్రి సీతక్క

భద్రాచలం, మే 29: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దివ్య క్షేత్రంలోని బేడా మండపంలో స్వామి వారికి అర్చకులు గురువారం నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

## కాలుష్య పరీక్షలు


ముత్యాలమ్మపేటలో కాలుష్య పరీక్ష చేస్తున్న అధికారులు

బూర్గంపహాడ్, మే 29: మండలంలోని సారపాక పారిశ్రామిక వాడ పరిసర ప్రాంతాలతోపాటు తాళ్లగొమ్మూరు, కోయగూడెం గ్రామాల్లో గురువారం కాలుష్య పరీక్షలను కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారులు బుధ, గురువారాల్లో నిర్వహించారు. ఐటీసీ కర్మాగారం బాయిలర్ల నుంచి దుమ్ముధూళి, విషపూరిత వాయువులు విడుదలవుతున్నాయని, తమ ఆరోగ్యం దెబ్బతింటున్నదని బాధితులు ఇచ్చిన ఫిర్యాదులతో అధికారులు ఈ పరీక్షలు నిర్వహించారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు.

## 'అశ్వారావుపేట'లో వంద రోజుల ప్రణాళిక

అశ్వారావుపేట టౌన్, మే 29: అశ్వారావుపేట పురపాలక సంఘంలో జూన్ 2 నుంచి వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టనున్నట్లు కమిషనర్ కె.సుజాత తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో పచ్చదనం–పరిశుభ్రత, రోడ్ల మరమ్మతులు, మహిళా సంఘాల ఏర్పాటు, తడి–పొడి చెత్త సేకరణ, కాలువల్లో పూడికతీత, శిథిల భవనాలు–బావుల తొలగింపు తదితరాలు ఉంటాయని వివరించారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు.

## కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సుజాత

కొత్తగూడెం అర్బన్, మే 29: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ (కేజీఎంసీ)గా ఏర్పాటైన నేపథ్యంలో తొలి కమిషనర్‌గా కే.సుజాతను నియమిస్తూ సీడీఎంఏ శ్రీదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న ఆమె.. ఇప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. కాగా, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కూడా కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఆ ఏడు పంచాయతీలకు చెందిన ఆస్తులను, పాల్వంచ మున్సిపాలిటీకి చెందిన ఆస్తులను కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదలాయించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట, మే 29: మద్యం తాగొద్దంటూ పెద్దలు మందలించడాన్ని తట్టుకోలేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని రమణక్కపేటకు చెందిన జల్లి నర్సయ్య(55) కుమార్తె భద్రమ్మ, తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఫంక్షన్ ఏర్పాటు చేసింది. నర్సయ్య మద్యం మత్తులో స్థానిక పెద్దలతో వాగ్వివాదానికి దిగాడు. మద్యం తాగవద్దంటూ ఆయనను ఆ పెద్దలు మందలించారు. దీనిని అవమానంగా భావించిన ఆయన.. అదే రోజు ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. అతడి కుమారుడు జల్లి ప్రసాద్ ఫిర్యాదుతో ఎస్సై యయాతి రాజు నమోదు చేశారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కరకగూడెం, మే 29: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవితేజ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. తమ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు ఉన్నాయన్నారు.